## ఘనంగా ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం



అత్యధిక సార్లు రక్తదానం చేసిన రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

శ్రీరాంపూర్, జూన్ 19 : శ్రీరాంపూర్ ఎంవీటీసీ కేంద్రంలో బుధవారం రెడ్ క్రాస్ సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ సికిల్ సెల్ డే సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్, ఎంవీటీసీ మేనేజర్ రామారావు మాట్లాడుతూ తెలంగాణ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉందన్నారు. వ్యాధి లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. చిన్నపిల్లల నుంచి పెండ్లి వయసు వచ్చినవారు నర్సరీ నుంచి పీజీ విద్యార్థులు, పెండ్లికి ముందు హెచ్‌బీఎటూ రక్త పరీక్షలు చేసుకోవాలని కోరారు. ప్రతి 100 మందిలో ఐదుగురు తలసేమియా సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులున్నారని పేర్కొన్నారు. జిల్లాలో 500 మంది రోగులున్నారని తెలిపారు. ఎంవీటీసీకి చెందిన రాజ్‌కుమార్ అత్యధిక సార్లు రక్తదానం చేసి గవర్నర్‌చేతుల మీదుగా అవార్డు పొందారు.రాజ్‌కుమార్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు చుంచు శంకర్‌వర్మ, తలసేమియా సికిల్ సెల్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

**సికిల్ సెల్‌పై అవగాహన అవసరం**

మందమర్రి, జూన్ 19: సికిల్ సెల్ అనీమియాపై అందరూ అవగాహన కలిగి ఉండాలని భవిష్యత్ తరాలకు అవగాహన ఎంతో అవసరమని మంచిర్యాల జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, ప్రభుత్వ వైద్యురాలు మానస అన్నారు. జాతీయ సికిల్‌సెల్ అనీమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని దీపక్ నగర్‌లో గల అర్బన్ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం సింగరేణి పాఠశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో విద్యార్థులకు సికిల్‌సెల్ అనీమియా పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పలువురు విద్యార్థులకు సికిల్‌సెల్ పరీక్షలు చేశారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం, యూపీహెచ్‌సీ సూపర్ వైజర్ ఆకుల సురేఖ, ఏఎన్‌ఎంలు గడ్డం రాజేశ్వరి, చిప్పరి పద్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


మందమర్రిలో కరపత్రాలతో అవగాహన కల్పిస్తున్న జడ్పీ చైర్ పర్సన్ భాగ్యలక్ష్మి, డాక్టర్ మానస

## ఈపీ ఆపరేటర్ పరీక్షలు

శ్రీరాంపూర్, జూన్ 19 : శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో నిర్వహిస్తున్న ఈపీ ఆపరేటర్ ప్రాక్టికల్ ట్రెయినీ పరీక్షల్లో రెండవ రోజు 65 మంది రాత పరీక్షలకు ఎంపికయ్యారు. 135 మందికి గాను 123 మంది పరీక్షలకు హాజరయ్యారని డీవైజీఎం అరవిందరావు పేర్కొన్నారు. పరీక్షల కన్వీనర్‌గా ఎస్వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, పర్యవేక్షకులుగా అజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీవైజీఎం చిరంజీవులు, డీజీఎం చిరంజీవులున్నారు.

**ముగిసిన ఈపీ ఆపరేటర్ నియామక పరీక్షలు**

మందమర్రి, జూన్ 19: సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఏ.మనోహర్ ఆధ్వర్యంలో పట్టణంలోని సింగరేణి పాఠశాల ఆవరణలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఈపీ ఆపరేటర్ నియామక పరీక్షలు ముగిశాయి. మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలకు చెందిన 191 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా మొదటి రోజు 100 మందికి ఈపీ ఆపరేటర్ ట్రెయినీ, డ్రైవింగ్ ప్రొఫెసియన్సీ పరీక్షలు నిర్వహించగా రెండవ రోజు బుధవారం 91 మంది నిర్వహించాల్సి ఉండగా ఐదుగురు గైర్హాజర్ కావడంతో 86 మంది పరీక్షలు నిర్వహించారు. అందులో 41 మంది ఉత్తీర్ణత సాధించారు. రెండు రోజుల్లో ఏరియాలో 87 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 30న కొత్తగూడెంలో నిర్వహించే రాత పరీక్షకు హాజరు కావాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం రాజేశ్వర్ రెడ్డి, కార్పొరేట్ డీవైపీఎం సంతోష్, డీజీఎం ఐఈడీ రాజన్న, పీఎం శ్యాంసుందర్, డీవైపీఎం సత్యబోస్, ఎస్ఈ నాగరాజు నాయక్, అన్ని గనులు, విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## అంతరాయం లేకుండా బొగ్గు రవాణా చేయాలి

- శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి
- సీహెచ్‌పీలో డస్ట్ సప్రెషన్, ఫైర్ ఫైటింగ్ సిస్టం ప్రారంభం


డస్ట్ సప్రెషన్, ఫైర్ ఫైటింగ్ సిస్టం ప్రారంభిస్తున్న జీఎం సంజీవరెడ్డి

సీసీసీ నస్పూర్, జూన్ 19: ఎలాంటి అంతరాయం లేకుండా సీహెచ్‌పీ నుంచి బొగ్గు రవాణా చేయాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి సూచించారు. బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని సీహెచ్‌పీలో ఏర్పాటు చేసిన డస్ట్ సప్రెషన్, ఫైర్ ఫైటింగ్ సిస్టంలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ 5మిలియన్ టన్నుల బొగ్గును రవాణా చేసే సామర్థ్యంతో 2022 సంవత్సరంలో సీహెచ్‌పీని నిర్మించినట్లు తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన సీహెచ్‌పీలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సీహెచ్‌పీలో పనిచేస్తున్న టెక్నికల్ స్టాఫ్ డస్ట్ సప్రెషన్, ఫైర్ ఫైటింగ్ సిస్టం నడపడానికి తగిన నైపుణ్యత పొంది సమర్థవంతంగా పనిచేసేటట్లు చూడాలన్నారు. అనంతరం ఆయన సీహెచ్‌పీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, సీఎంవోఏఐ శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్వోటూజీఎం పురుషోత్తంరెడ్డి, సీహెచ్‌పీ డీజీఎం వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్,జూన్ 19: కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. ఈనెల 12న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) జిల్లా పర్యటనలో భాగంగా వాంకిడి మండలం సవాతి గ్రామంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని పలు శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. విద్య, భవనాలు, రోడ్లు, భూములు, ఇండ్ల సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రహదారుల నిర్మాణం, మరమ్మతుల పనులు సత్వరమే చేపట్టాలన్నారు. విద్య, వైద్యానికి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ రాజస్వమండలాధికారి లోకేశ్వరరావు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, విద్యాశాఖ అధికారి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, జిల్లా పంచాయితీ అధికారి భిక్షపతి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

**సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి సహకరించాలి**

తిర్యాణి,జూన్ 19: ఆయా శాఖల అధికారులు సమన్వయంతో సమస్యలు పరిష్కరించుకుని అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే మండల స్థాయి అధికారులకు, సిబ్బందికి సూచించారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నీతి అయోగ్ కార్యక్రమంలో భాగంగా 39 అంశాలపై మండల స్థాయి అధికారులు, సిబ్బంచే బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో అత్యంత వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి పథం వైపు తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం నీతి అయోగ్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు.దీనిలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఎనిమిది మండలాలు గుర్తించడం జరిగిందన్నారు. ఇందులో తిర్యాణి మండలం ఒకటని తెలిపారు. ఈ మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే శాఖలతో సంబంధం లేకుండా సమష్టిగా పని చేయాలన్నారు. అనంతరం ఫారెస్ట్ అనుమతులు లేక నిర్మాణాలు నిలిచిపోయిన తిర్యాణి నుంచి త్రీఇంక్లైన్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం, అలాగే మండల కేంద్రంలోని 30 పడకల దవఖానలో వైద్యులను నియమించాలని పలువురు లిఖితపూర్వకంగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించారు. అంతకు ముందు మండలకేంద్రంలోని ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేశారు. ఎరువులు, పురుగుల మందులు నిర్ణీత ధరలకు విక్రయించాలని, వీటితో పాటు రసీదును సైతం ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. ఈ విషయంపై వ్యవసాయ అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి తుకరాం బట్, అడిషనల్ డీఆర్‌డీఏ ఏపీడీ రామకృష్ణ, నీతిఅయోగ్ ప్రత్యేక అధికారి మణివెల్, ఎంపీడీవో వేముల మల్లేశ్, ఇన్‌చార్జి తహసీల్దార్ వంశీ కృష్ణ ఆయా శాఖాల అధికారులు, తదితరులున్నారు.

## 'కాంగ్రెస్ నాయకుల కోసమే పోలీసులు'

భీమారం, జూన్ 19 : పోలీసులు కాంగ్రెస్ నాయకుల కోస మే పనిచేస్తున్నారని, అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నార ని బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజారమేశ్ ఆరోపించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. ప్రశ్నించిన భీమారం మండలాధ్యక్షుడు కలగూర రాజ్ కుమార్‌పై, సుద్దాలలో రాజబాపు, కంచన్‌పల్లిలో విమల, చెన్నూర్‌లో మహేశ్, భారతక్క, సుధాకర్, శ్రీధర్, లక్ష్మణ్, రాజాబాపు, వారి తండ్రి, కొడుకు విజయ్‌పై, జైపూర్‌లో రమేశ్‌పై, మందమర్రి మండలంలో సాగర్, అశోక్, రామకృష్ణపూర్‌లో రవి, కోటపల్లిలో విద్యాసాగర్‌పై వరుసగా కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులే దాడులు చేస్తూ, తిరిగి బీఆర్ఎస్ నాయకులపై కేసులు నమోదు చేయడమేమిటని ప్రశ్నించారు. ఎంపీపీ మంత్రిబాపు, మందమర్రి జడ్పీటీసీ వేల్పుల రవి, జైపూర్ జడ్పీటీసీ సునీత- తిరుపతి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సమ్మయ్య, మాజీ సర్పంచ్ దాసరి మధునయ్య, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ భూక్యా రాజ్ కుమార్ నాయక్, మాజీ ఎంపీపీ జాడి ఏసయ్య, మాజీ ఎంపీటీసీ ఆత్కూరి రాము, నాయకులు వేణు, రాజబాపు, మణిదీపక్ పాల్గొన్నారు.

### 'పాఠ్యపుస్తకాల పంపిణీ'

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 19 : బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ఇదులవాడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధుకర్, కాశయ్య, రాజయ్య, శంకర్, పెంటయ్య, లచ్చన్న, జయరాజ్ తదితరులు న్నారు.

## నేటి నుంచి నులిపురుగుల నివారణ కార్యక్రమం

ఆసిఫాబాద్ టౌన్, జూన్19: జిల్లాలో ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని వందశాతం విజయవంతం చేయాలని కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా వైద్యశాఖాధికారి తుకారాంభట్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1-19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు జిల్లాలో 1,73,494 మంది ఉన్నారని అన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలలతో పాటు బడిబయట ఉన్న పిల్లలకు మాత్రలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 20న మాత్రలు తీసుకోనట్లయితే జూన్ 27న మరోసారి అవకాశం ఉంటుందని తెలిపారు. నులిపురుగుల నివారణా మాత్రలను పిల్లలకు భోజనం చేసిన అనంతరం అందించాలని, ఇబ్బందులెదురైతే వైద్యులకు తెలియజేయాలన్నారు. పిల్లలకు మాత్రలు అందించే ముందు వారి ఆరోగ్య పరిస్థితిని గురించి తెలుసుకుని, ఆరోగ్యంగా ఉంటేనే అందించాలని సూచించారు.

## డిస్మిస్ లేఖలను ఉపసంహరించుకోవాలి

శ్రీరాంపూర్, జూన్ 19 : సింగరేణి వ్యాప్తంగా 150 మంది కార్మికులను ఉద్యోగాల నుంచి(డిస్మిస్) తొలగించిందని వెంటనే యాజమాన్యం డిస్మిస్ లేఖలు ఉపసంహరించుకొని కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని హెచ్ఎంఎస్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్మికులకు లేఖలు నేరుగా ఇవ్వకుండా రిజిష్టర్ పోస్టు ద్వారా పంపడాన్ని వ్యతిరేకించారు. కార్మికులను డిస్మిస్ చేయడం అన్యాయమన్నారు. ఇప్పటికే డ్యూటీలు చేస్తున్న వారిని కూడా యాజమాన్యం డిస్మిస్ చేసిందని తెలిపారు. కార్మికుల డిస్మిస్‌పై ఏఐటీయూసీ నోరు మెదపడం లేదని ఆరోపించారు. గనులు, ఓసీపీలపై మస్టర్లు పడి వెళ్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, సందీప్, తులా అనిల్, శ్రీనివాస్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

రెబ్బెన, జూన్ 19: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా హెచ్ఎంఎస్ ఉపాధ్యక్షుడు పత్తెం రాజబాబు అన్నారు. గోలేటిటౌన్‌షిప్‌లోని హెచ్ఎంఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు అండగా ఉండాల్సిన గుర్తింపు కార్మిక సంఘం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ ధర్నాలు చేయడం, వినతిపత్రాలు ఇవ్వడం లాంటివి చేస్తే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయా అని ప్రశ్నించారు. సింగరేణి దవాఖానల్లో సరైన డాక్టర్లు లేక కార్మికులు, కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని, యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. బెల్లంపల్లి ఏరియా దవాఖానకు గుర్తింపు కార్మిక సంఘం పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేయాలని హెచ్ఎంఎస్ యూనియన్ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఎండీ ఓజీయార్, జిల్లా అధ్యక్షుడు ఎండీ గౌస్, ఏరియా సెక్రటరి ఇనూస్, పిట్ సెక్రటరి ఆరీఫ్, తిరుపతి, దవాఖాన ఇన్‌చార్జి శ్రీనివాస్‌తో పాటు పలువురు ఉన్నారు.

## శ్రీరాంపూర్ కొత్తరోడ్‌లో కార్డన్ సెర్చ్

శ్రీరాంపూర్, జూన్ 19 : శ్రీరాంపూర్ ఆర్కే 6 గుడిసెలు కొత్తరోడ్ కాలనీలో బుధవారం సీఐ మోహన్, ఎస్ఐ సంతోష్, పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటా తనిఖీ చేసి అనుమతి పత్రాలు లేని వాహనాలను పట్టుకున్నారు. అనంతరం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలో భాగంగానే కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. కాలనీల్లో కొత్తవారు అనుమానితంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. యువత చెడు వ్యసనాలకు లోను కావద్దని కోరారు. దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని సూచించారు.

## లయన్స్ క్లబ్ సేవలు విస్తరించాలి

రెబ్బెన, జూన్ 19: లయన్స్ క్లబ్ ఆఫ్ గోలేటి స్పోర్ట్స్ క్లబ్ సేవలు అభినందనీయమని 320జీ జిల్లా గవర్నర్ లయన్ హనుమన్ల రాజిరెడ్డి అన్నారు. రెబ్బెన మండలం గోలేటిటౌన్‌షిప్ లో గల సింగరేణి ఉన్నత పాఠశాలలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. అనంతంర పాఠశాల విద్యార్థులకు ఉచితంగా 100 మందికి నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రిక్కల నారాయణరెడ్డి, క్లబ్ అధ్యక్షుడు ఆర్వీ రామకృష్ణ, క్యాబినెట్ సెక్రటరీ వెంకటరమణరెడ్డి, ఆర్సీ సుదర్శన్, జడ్ సీ రాజయ్య, డీజీ అఫిషియల్ విజిట్ నారాయణరావు, క్లబ్ సెక్రటరీ అన్నం రమేశ్, సభ్యులు చందర్, మహేందర్‌రెడ్డి, భాస్కర్, శంకర్, తదితరులున్నారు.


